ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి



రాజేంద్రనగర్ డీఎం రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

రాజేంద్రనగర్: ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని కోరుతూ హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి ప్రాంతాలకు చెందిన మహిళలు రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోఠి నుంచి ఉప్పర్‌పల్లి మీదుగా రాజేంద్రనగర్ వరకు గతంలో 94యూ, 92ఎం బస్సులు హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి మీదుగా రాజేంద్రనగర్‌కు నడిచేవన్నారు. కరోనా అనంతరం వాటిని దారి మళ్లించి నేరుగా ప్రధాన రహదారి గుండా వెళ్లేలా చర్యలు తీసుకున్నారన్నారు. దీంతో తాము దాదాపు 3, 4 కిలోమీటర్లు నడిచి హైదర్‌గూడ బస్టాప్ వద్దకు వచ్చి బస్సులు ఎక్కాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి మీదుగా బస్సులను నడిపిస్తే మహిళలు, వృద్ధులు, విద్యార్థులు వివిధ పనుల కోసం నగరానికి వెళ్లే వారికి ఎంతగానో అనుకూలంగా ఉంటుందన్నారు.

జలమండలి జీఎం పదవీ విరమణ



పదవీ విరమణ చేసిన చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను అధికారులు, సిబ్బంది సన్మానించి వీడ్కోలు పలికారు. ఇదిలాఉంటే కూకట్‌పల్లి జలమండలి జనరల్ మేనేజర్ ప్రభాకర్ రాజేంద్రనగర్ జీఎంగా అదనపు బాధ్యతలు చంద్రశేఖర్ నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో చేసిన పనులే ప్రజలు, సిబ్బంది గుర్తుపెట్టుకుంటారన్నారు. తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు రాం నరసింహా రెడ్డి, వినాయక్ పాల్గొన్నారు.

అబ్బాయిల్లోనే ఆటిజం ఎక్కువ

సైక్రియాటిస్ట్ డాక్టర్ చరణ్ తేజ



గచ్చిబౌలి: అమ్మాయిల కంటె అబ్బాయిల్లోనే ఆటిజం నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ చరణ్ తేజ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ఆటిజం గురించి వివరించారు. మెదడులోని కొన్ని భాగాలలో ఇన్‌పుట్, ప్రాసెస్ లాంగ్వేజ్‌ని అర్థం చేసుకునే సమస్యల నుంచి ఆటిజం ఉత్పన్నమవుతుందన్నారు. ఇతర వ్యక్తులు ఏమంటున్నారో తెలుసుకోవడంలో ఆటిజం పిల్లలు ఇబ్బందిపడతారని పేర్కొన్నారు. కంటి చూపు లేకపోవడం, చెప్పిన పదా లే పదే పదే చెప్పడం, శబ్దా లు, స్పర్శ, సంజ్ఞలు, దృశ్యాలను పసిగట్టలేకపోవడం తదితర సమస్యలు ఆటిజం ఉన్న వారిలో ఉంటాయన్నారు. బిహేవియర్ థెరపీ, ఇంద్రియ ఏకీకరణ, కమ్యూనికేషన్ థెరపీ ద్వారా ఆటిజం పిల్లల్లో మార్పు తేవచ్చని వివరించారు.

వాటర్ ప్లాంట్లను తొలగించండి



వాటర్ ప్లాంట్లను తొలగించాలని ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేసిన ఊట్ల చంద్రారెడ్డి, స్థానికులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని పాపిరెడ్డినగర్ బస్తీలో అక్రమ వాటర్ ప్లాంట్ల నిర్వహణతో బస్తీవాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని వాటర్ పాంట్లను తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సోమవారం బస్తీ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున స్థానికులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి వినతి పత్రం అందజేశారు. అరా, కొర వస్తున్న నీటిని వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు తోడేస్తు సొమ్ము చేసుకుంటున్నారని, వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోయి నీటి కొరత ఏర్పడిందని వాపోయారు. నేడు బోరు వేయాలంటే సుమారు 1500 ఫీట్ల వరకు వేయాల్సి వస్తుంది. ఇప్పటికే బస్తీలో ఉన్న వాటర్ ప్లాంట్లకు తోడుగా రోడ్డు నెంబర్ 16 బ్లాక్ సిలో మరో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, సిహెచ్ రామకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వీరన్న, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, బస్తీ వాసులు పాల్గొన్నారు.

13న 'మా భగవతి విశాల్ జాగరణ్'

జియాగూడ: రహీంపురా అంబేడ్కర్ భవన్‌లో ఉగాది పండుగను పురస్కరించుకుని ఈనెల 13న 27వ మా భగవతి విశాల్ జాగరణ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఈరాలాల్, సలహాదారులు మోహన్‌లాల్ చిట్టివాలే, అశోక్ సింగ్, ప్రధాన కార్యదర్శి మహేష్ సింగ్ తెలిపారు. సోమవారం రహీంపురాలో సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..13న రాత్రి 8 గంటలకు మా భగవతి విశాల్ జాగరణను పురస్కరించుకుని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భజన కార్యక్రమాన్ని శ్రీరామ్‌దేవ్ భక్త సంఘం భాగ్యనగర్ ప్రముఖ గాయకులు సుశీల్‌గోపాల్ బజాజ్, ఠాకూర్ రవి సింగ్, ఎస్.రాజన్‌కుమార్, అనూప్‌కుమార్ భజనలు నిర్వహిస్తారన్నారు. అలాగే మా భగవతి అలౌకి శృంగార్, జగ్ మగ్ రోషిణి, మాతాకా ఖజానా, చప్పన్‌భోగ్, తారా రాణి కథ, అఖండ జ్యోతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. సుధీర్ సింగ్, ఠాకూర్ విపిన్ రాజ్ సింగ్, సచిన్‌రాజ్ సింగ్, రామ్ సింగ్, ధన్‌రాజ్ సింగ్, కిషన్ సింగ్, గోపాల్ సింగ్, మోహన్ సింగ్ పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభించిన మా భగవతి విశాల్ జాగరణ్ ప్రతినిధులు

కిరాణా షాపులో గంజాయి విక్రయం

300 గ్రాముల గంజాయి స్వాధీనం.. కేసు నమోదు

గచ్చిబౌలి: కిరాణా షాపులో 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితురాలిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు. నానక్‌రాంగూడలో కిరాణ షాపు నిర్వహిస్తున్న అనురాధాబాయి(39) గుట్టుచప్పుడు కాకుండా విద్యార్థులు, కూలీలకు గంజాయి విక్రయిస్తోంది. ధూల్‌పేట్ నుంచి గంజాయి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లలో అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం రాత్రి దుకాణంపై దాడి చేశారు. నిందితురాల నుంచి 300 గ్రాముల 39 గంజాయి ప్యాకెట్లు, రూ.1200 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఆమెకు నోటీసులు ఇచ్చామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గచ్చిబౌలి సీఐ ఆంజనేయులు తెలిపారు.



గంజాయి ప్యాకెట్లతో అనురాధాబాయి

బండ్లగూడ @ రూ 20.41 కోట్లు

- కార్పొరేషన్ పరిధిలో వసూలైన ఆస్తి పన్ను
- ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బండ్లగూడ: గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ. 20.41 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి 33,328 నివాసాలకు అసెస్‌మెంటు చేశారు. వసూళ్ల లక్ష్యం పాత బకాయిలతో కలిపి రూ. 28.39 కోట్ల టార్గెట్ నిర్దేశించగా అధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకోవడంతో ఈ మొత్తం వసూలైంది. ఆస్తి పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు దృష్టి కేంద్రీకరించడం, శరవేగంగా బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ అభివృద్ధి చెందడంతో కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో భారీగా ఆదాయం సమకూరింది.

2022-23 ఆర్థిక సంవత్సరంలో..

2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అప్పుడు 30,840కు పైగా నివాసాలకు అసెస్‌మెంటు చేశారు. అయితే కొంతమంది సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో అపరాధ రుసుంతో కలిపి మొత్తం ఆదాయం రూ. 13.86 కోట్లు వసూలైంది.

గతంలో కేవలం లక్షల్లో ఆదాయం..

గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో కేవలం రూ.లక్షల్లో మాత్రమే ఆదాయం వచ్చేది. పన్నులు కట్టేందుకు కూడా ఆసక్తి చూపని ప్రజలు కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు అసెస్‌మెంట్ పూర్తి చేయడంతో పాటు ఇంటి నంబర్లు కేటాయించి పన్నులు విధించడంతో కార్పొరేషన్‌కు భారీగా ఆదాయం పెరుగుతోంది. మున్సిపల్ కార్పొరేషన్ పన్నుపై రాయితీ ఇస్తున్నది. ఏప్రిల్‌లో ఏడాది పన్ను మొత్తం చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తుంది. అలాగే పన్నులు సకాలంలో చెల్లించకపోతే పెనాల్టీ విధిస్తున్నారు. అధికారులు ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తుండడంతో ప్రజలు సైతం పన్నులు కట్టేందుకు ముందుకొస్తున్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి..



కార్పొరేషన్‌కు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రణాళికబద్ధంగా సమష్టి కృషితో పని చేయడంతోనే పన్నులు చాలావరకు వసూళ్లయ్యాయి. కార్పొరేషన్‌లోని ప్రజలందరూ కూడా బాధ్యతగా భావించి సకాలంలో పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.
–బీ శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్

నీటి సమస్య ఉంటే ఫోన్ చేయండి

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే ఫోన్ లేదా వాట్సాప్‌లో ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బి. సుమన్ రావు (7337336191), ఏఈ నరేశ్, 7337323577 నంబర్లను సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మనూ' పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ



అమీనా బేగమ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోని పరిశోధక విద్యార్థిని అమీనాబేగంకు సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని ఆ విభాగం ప్రొఫెసర్ బదియుద్దీన్ అహ్మద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమెకు సహ పర్యవేక్షకులుగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాసమూర్తి వ్యవహరించారు. ఆమె 'సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ సెలెక్ట్ ఎంటర్‌ప్రైజెస్ ఆఫ్ సౌత్ ఇండియా' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించగా పరిశీలించి డిగ్రీని ప్రకటించారు.

చిరునామా, పిన్‌కోడ్ కరెక్ట్‌గా ఉండాలి

కొత్తగూడ పోస్టాఫీస్ అధికారులు

రాయదుర్గం: చిరునామా, పిన్‌కోడ్ సరిగా లేకపోతే ఉత్తరాలు చేరవలసిన ప్రదేశానికి చేరడం లేదని కొత్తగూడ పోస్టాఫీస్ అధికారులు సోమవారం తెలిపారు. చిరునామాదారుడి ఫోన్ నెంబర్ కూడా రాస్తే సులభంగా చేర్చడానికి అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. పలువురు చిరునామా, పిన్‌కోడ్ సక్రమంగా రాయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరామ్‌నగర్ అన్ని బ్లాక్‌లు, రాఘవేంద్రకాలనీ, గోపాల్‌రెడ్డి నగర్,మసీదుబండ, ఆనంద్‌నగర్, శిల్పాపార్కు, ఆర్‌టీఓ ఆఫీస్, సీఆర్ ఫౌండేషన్, పరిసర ప్రాంతాలు, అంజయ్యనగర్, పరిసర కాలనీలు, బస్తీలు, జాగృతికాలనీ, ప్రశాంత్‌నగర్, శరత్‌సిటీమాల్, బొటానికల్‌గార్డెన్ పరిసర కాలనీలు, బస్తీలు, మైహోమ్‌మంగళ, శిల్పాగార్డెన్, ఇజ్జత్‌నగర్, ఖానామెట్, శిల్పాహిల్స్,న్యాక్ పరిసర కాలనీలు, బస్తీలలోని ఉత్తరాలను కొత్తగూడ పోస్టాఫీస్ పరిధిలో బట్వాడా చేయడం జరుగుతోందని వారు వివరించారు.

చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

4 నుంచి 6 వరకు నిర్వహణ



రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో కొలువుదీరిన రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శైవాగమ శాస్త్ర ప్రకారం ఉత్సవాలు జరుగుతాయి. గురువారం ఉదయం 8.45 గంటలకు భూతబలి, గణపతి పూజతో ఉత్సవాలను ఆరంభిస్తారు. అనంతరం పుణ్యాహవచనం, పంచగవ్యం, దీక్షాధారణ, అస్త్రరాజార్చన, ప్రధాన కుంభావాహన నీరాజన మంత్రపుష్పములు నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, బలిహరణ, రాజరాజేశ్వరీ చంద్రమౌళీశ్వరుని కళ్యాణం, నీరాజన మంత్ర పుష్పములు నిర్వహిస్తారు.

అన్నమయ్యపురంలో శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలను రెండవరోజు సోమవారం నిర్వహించారు. అన్నమాచార్య భావన వాహిని విద్యార్థులు అన్నమయ్య కీర్తనలను ఆలపించి సందర్శకులను అలరించారు. సంకీర్తనల స్వరార్చనకు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహరాజు, వాదిరాజాచార్య స్వామిలు తమ ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. సంస్థ అధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు కళాకారులను సత్కరించారు.

నగరంలో ముజిగల్ అకాడమీ సేవలు

సాక్షి, సిటీబ్యూరో: సంగీత శిక్షణకు దేశవ్యాప్తంగా పేరొందిన ముజిగల్ అకాడమీ నగరంలో తన నూతన శాఖను ఏర్పాటు చేసింది. బీరంగూడలో ఈ అకాడమీ నెలకొల్పిన సందర్భంగా ప్రముఖ నేపథ్య గాయని అనన్య భాస్కర్ హాజరై చిన్నారులు, సంగీత శిక్షణార్థులతో కలిసి ఆడి పాడి అలరించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు డా.లక్ష్మీనారాయణ యేలూరి మాట్లాడుతూ దాదాపు 1500చ.అ. విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ అకాడమీ ద్వారా అత్యుత్తమ సంగీత శిక్షణ సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు సంగీతాభిమానులు పాల్గొన్నారు.

5న ప్రత్యేక 'ఖీరత్'

గోల్కొండ: ఈ నెల 5న రంజాన్ చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ఖీరత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ అన్నారు. ఈ నెల 5న మధ్యాహ్నం ఒంటి గంటకు గోల్కొండ రిసాల బజార్, దిలావర్‌షా నగర్‌లోని అక్తర్ మసీదులో ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన అన్నారు. రంజాన్ మాసం ప్రత్యేకతలు, రంజాన్ మాసపు శుక్రవారాలు ముఖ్యంగా రంజాన్ చివరి శుక్రవారం ప్రత్యేకతల గురించి ఈ కార్యక్రమంలో ఖారీలు వివరిస్తారని ఆయన అన్నారు. ఇరాన్ దేశానికి చెందిన ఖారీ ముహ్మద్ జవాద్ ఖషాఫీ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే ఎరుకలకు న్యాయం



భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఎరుక కులస్తులకు న్యాయం జరుగుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఎరుకల సంఘం వారు సోమవారం కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఎరుకల నాంచారమ్మ జాతర వేడుకలను ప్రభుత్వ పరంగా నిర్వహించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎరుక కులస్తులు స్వతహాగా కష్టజీవులన్నారు. వారి డిమాండ్లు న్యాయమైనవేనని ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసు అని ఆయన పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ, సుల్తాన్ యాదగిరి, బుడ్డ సత్యనారాయణ, మల్లికార్జున్, పూతడి మల్లేష్, తేగల కృష్ణయ్య, భువనగిరి జిల్లా కాంగ్రెస్ నాయకుడు రాఘవరెడ్డి తదితరులున్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి అండగా ఉంటాం

నాంపల్లి: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘానికి టీఎన్జీఓ సంఘం అండగా ఉంటుందని టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్ అన్నారు. సోమవారం నాంపల్లిలోని గృహకల్ప భవన సముదాయంలో ఇటీవల నూతనంగా కొలువుదీరిన తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఆత్మీయ సమావేశం జరిగింది. సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మారం జగదీష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ..ఏపీలో పని చేస్తున్న తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులను వెనక్కి రప్పించేందుకు శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ మాట్లాడుతూ.. సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. వరుసగా ఆరు పర్యాయాలు సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం జ్ఞానేశ్వర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఆయన పుట్టిన రోజున ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని కేక్ కట్ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కస్తూరి వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, బి.శ్యామ్, తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం నేతలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రక్షాళనపై దృష్టి పెడదాం

లంగర్‌హౌస్: అక్రమ ఓటర్లతో పాటు ఓట హక్కు కోల్పోయిన వారి జాబితాపై మొదలు ప్రధాన దృష్టి పెడదామని బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని మాధవీలత అన్నారు. లంగర్‌హౌస్‌కు చెందిన భానుప్రకాష్‌ను ఖమ్మం జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించగా ఆయన ఆధ్వర్యంలో మాధవీలతను కలిశారు. ఈ సందర్భంగా గతంలో ఎన్నికల వేళ ఎదుర్కొన్న సమస్యలను ఆమెకు వివరించారు. మాధవీలత మాట్లాడుతూ..ఓటరు జాబితా సవరణ కోసం అవసరమైతే నేరుగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరింపజేస్తామన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, సుగంధ పుష్ప, వినేష్‌సింగ్, నాగేంద్ర ప్రకాష్ రెడ్డి ఉన్నారు.

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

గోల్కొండ: అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన తన వద్దకు వచ్చిన వారితో మాట్లాడి వారి అభ్యర్థనలను విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్ పథకానికి అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వెంటనే తాను ఆర్థిక సహాయం ఇప్పిస్తానన్నారు. స్వయం ఉపాధి, మహిళా పొదుపు సంఘాలు, తదితర వాటికి దరఖాస్తు చేసుకునే వారికి సైతం అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా వారికి తన ఆఫీస్ లెటర్‌పై సంబంధిత అధికారులకు అభ్యర్థన పత్రాన్ని కూడా ఇస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, అబ్బాస్ హుస్సేన్ తదితరులున్నారు.

సిబ్బందిని అభినందించిన ఉప కమిషనర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందిని ఉప కమిషనర్ రవి కుమార్ అభినందించారు. ఆస్తిపన్ను వసూళ్లల్లో 98.98 శాతం వసూలు చేసినందుకు సర్కిల్ కార్యాలయంలో సోమవారం బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బందిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని 45,884 మంది ఇంటి యజమానుల నుంచి ఆస్తిపన్ను వసూలు చేశామన్నారు. ఉన్నతాధికారులు రూ. 52 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా రూ. 51. 47 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేసేందుకు కొన్ని రోజులుగా అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేసినట్లు పేర్కొన్నారు. సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు, కాలనీ, బస్తీ సంక్షేమ సంఘం సభ్యులు, ఇతరులకు ఆయన కృజ్ఞతలు తెలిపారు.

నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిమను ఊరేగింపుగా తీసుకువస్తున్న ప్రతినిధులు

రాజేంద్రనగర్: బుద్వేల్ టీచర్స్ కాలనీలోని కట్ట మైసమ్మ ఆలయ ఆవరణలో శ్రీ నాగేంద్ర స్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం కనుల పండువగా సాగింది. ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం 6.30 గంటల ప్రాంతంలో నాగేంద్ర స్వామి ప్రతిమను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాగేంద్ర స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



పూజలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

ఆస్తిపన్ను రాయితీకి విశేష స్పందన

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ అధికారులు ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ ఇవ్వగా రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజల నుంచి విశేష వచ్చింది. మొదటి రోజు రూ. 30 లక్షల ఆస్తిపన్నును కట్టారు. ఏప్రిల్ 1 నుంచి 30 వ తేదీ వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీని అధికారులు ప్రకటించి భారీగా ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్ నగర్ డివిజన్ల పరిధిలోని ఇంటి యజమానులు రూ. 30 లక్షల ఇంటి పన్ను చెల్లించారు. ప్రజలు 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్ రవి కుమార్ సూచించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

శంషాబాద్: ఓటుహక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సూచించారు. మున్సిపల్ కార్మికులతో కలిసి కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పరుపుల కంపెనీలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టాటానగర్‌లోని పరుపుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీలో కొన్ని నెలలుగా పరుపులు తయారు చేస్తున్నారు. సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన యజమాని యాకుత్ అందరిని అప్రమత్తం చేయగా అప్పటికే అతడి చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే పరుపుల తయారీ సామగ్రి మొత్తం కాలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

వివాహ వేడుకలో ప్రముఖులు



వివాహ వేడుకకు హాజరైన మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి

శంషాబాద్: పట్టణంలోని జేడీ కన్వెన్షన్ హాలులో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మనవరాలు వైష్ణవి వివాహం నిఖిల్‌గౌడ్‌తో ఆదివారం రాత్రి జరిగింది. ఈ వేడుకకు వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు హాజరయ్యారు. వధూవరులను మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి ఆశీర్వదించారు. వారి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డి. వెంకటేశ్‌గౌడ్, కె. చంద్రారెడ్డి, మంచర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.